క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు, ఆకవీడు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా చినగానిపల్లె, చోళ్లవీడు, అక్కపల్లె, ఆరవీటికోట, కోత్తూరు, అచ్చంపేట గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బాలగురవయ్య తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బంది సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం


సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

గిద్దలూరు రూరల్: భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల సందర్భంగా పట్టణంలోని రేడియో బావి సమీపంలో గల సత్యసాయి సేవా మందిరంలో భక్తులు శుక్రవారం సత్యసాయి సత్యనారాయణ వ్రతాన్ని ఆచరించారు. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, వేదపఠనం, నామసంకీర్తన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాలబాలికలతో బాల వికాస్ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తకోట గ్రామ సమీపంలో గల అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ కోసం నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు శుక్రవారం తన సిబ్బందితో కలిసి ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆర్మీ జవాన్లు, మాజీ సైనికులు క్యాంటీన్‌లో పొందే మద్యం బాటిళ్లను బహిరంగ మార్కెట్లో విక్రయించడం నేరమని స్పష్టం చేశారు. దాడిలో ఎక్సైజ్ సిబ్బంది శ్రీపతి, బత్తిని వెంకటేశ్వర్లు, హరిబాబు, షరీఫ్, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక


పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ సభ్యులు

మార్కాపురం: మార్కాపురం పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం పట్టణంలోని హెబ్రోన్ ప్రార్థనా మందిరంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.ఇర్మియా, ఉపాధ్యక్షుడిగా వట్నేలు మోజెస్, కె.నాగరాజు, కార్యదర్శిగా పీడీ ప్రసాద్‌రావు, సంయుక్త కార్యదర్శిగా డి.దేవయ్య, సంయుక్త ట్రెజరర్‌గా మనోహర్, గౌరవ అధ్యక్షుడిగా పీటర్ , సలహాదారులుగా కేఎస్ కోటయ్య, పి.రమేష్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా వినోద్, నాసరయ్య, డేవిడ్, దేవసహాయం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఇర్మియా మాట్లాడుతూ.. రానున్న క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహిస్తామని, పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రాజబాబు, డీన్ మస్తానయ్య

మార్కాపురం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జార్జి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు పేర్కొన్నారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాలలో మొక్కలు నాటారు. కళాశాల డీన్ మస్తానయ్య, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ కెప్టెన్ అనిల్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరోలు: ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా పెంచి పచ్చదనానికి ప్రాముఖ్యత ఇవ్వాలని ఎన్‌సీసీ ఆఫీసర్ కదిరిపోగు విజయ్‌కుమార్ కోరారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో క్యాడెట్లతో కలిసి మొక్కలు నాటారు. అడవి తంగేడు, దిరిశనం, కానుగ చెట్ల ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం అశ్వని కుమార్, ఉపాధ్యాయులు విశ్వరూపాచారి, రహమత్ తదితరులు పాల్గొన్నారు.


కొమరోలు : మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ ఆఫీసర్ విజయ్‌కుమార్


సలకలవీడులో ప్రారంభం కాని డిజిటల్ లైబ్రరీ, ఆర్‌బీకే, మహిళా డెయిరీ


కాలువపల్లెలో ప్రారంభించని ఆర్‌బీకే


పనులు అసంపూర్తిగా నిలిచిన అర్ధవీడు ఆర్‌బీకే

ప్రభుత్వ భవనాల పైనా కక్ష!

- ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, పాల వెల్లువ కేంద్రాలు
- వసతుల్లేని అద్దె భవనాలు, పంచాయతీ కార్యాలయాల్లో ఉద్యోగుల అవస్థలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



సూరవారిపల్లెలో నిరుపయోగంగా ఆర్‌బీకే, సచివాలయం

బేస్తవారిపేట: ప్రజల వద్దకే పరిపాలన తీసుకురావాలనే ఆశయంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కార్యాలయ భవనాలు ఆయా పంచాయతీల పరిధిలో నిర్మించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, మహిళా డెయిరీ భవనాల నిర్మాణం చేపట్టారు. నిర్మాణాలు పూర్తయ్యే సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఆ భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఆ భవనాలపై దృష్టి సారించలేదు. చాలా గ్రామాల్లో భవనాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నిర్మాణ పనులు పూర్తయినా ప్రారంభించకపోవడంతో సరైన మెయింటెనెన్స్ లేక భవనాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చిల్లచెట్లు పెరుగుతున్నాయి.

పాత భవనాల్లోనే విధులు

గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఉద్యోగులు వసతులు సక్రమంగా లేని పాత భవనాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. మరో వైపు అన్ని వసతులతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టి ఉద్యోగుల వెతలు తీర్చడంతోపాటు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని భవనాలివే..

- బేస్తవారిపేట మండలంలోని సలకలవీడులో డిజిటల్ లైబ్రరీ, మహిళా డెయిరీ కేంద్రాలు, బేస్తవారిపేట, కోనపల్లె, అక్కపల్లె, బసినేపల్లె, పిటికాయగుళ్ల, పెద్ద ఓబినేనిపల్లె, నేకునాంబాద్, సలకలవీడు, మోక్షగుండంలో సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేసినా ప్రారంభానికి నోచుకోలేదు.
- కొమరోలు మండలంలోని కొమరోలు–2, కొమరోలు–3, బాదినేనిపల్లె సచివాలయాలు, ఆర్‌బీకే కొమరోలు–3, 2, బాదినేనిపల్లె, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు బాదినేనిపల్లె, బ్రాహ్మణపల్లెలో, మహిళా డెయిరీ కేంద్రాలు ప్రారంభించలేదు.
- కంభం మండలంలోని ఎల్ కోటలో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం పూర్తయినా ప్రారంభం కాలేదు. జంగంగుంట్లలో సచివాలయం, యర్రబాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల పనులు చివరి దశలో నిలిచిపోయాయి.
- రాచర్ల మండలంలోని రాచర్ల, కాలువపల్లె, అనుమలపల్లెలో ఆర్‌బీకే, సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తయ్యాయి. గుడిమెట్టలో ఆర్‌బీకే ప్రారంభించలేదు. చిన్నగానిపల్లె, సత్యవోలు, చోళ్లవీడు సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి.
- అర్ధవీడు మండలంలోని యాచవరంలో సచివాలయం, ఆర్‌బీకేలు, అర్ధవీడు, దొనకొండలో మహిళా డెయిరీ కేంద్రం భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి.

వైఎస్ జగన్‌ను కలిసిన 'వెన్నా' దంపతులు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వెన్నా హనుమారెడ్డి దంపతులు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, ఆయన సతీమణి తర్లుపాడు జెడ్పీటీసీ సభ్యురాలు వెన్నా ఇందిర శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, కార్యకర్తలకు అండగా ఉండాలని వైఎస్ జగన్ సూచించినట్లు హనుమారెడ్డి చెప్పారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితోనూ వెన్నా దంపతులు భేటీ అయ్యారు.

108 ఉద్యోగులకు వేతన బకాయిలు చెల్లించాలి


కంభంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న 108 ఉద్యోగులు

కంభం: 108 ఉద్యోగులకు వేతన బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించడంతోపాటు తమ డిమాండ్లను పరిష్కరించాలని 108 ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ భాస్కర్ కోరారు. సమ్మెలో భాగంగా శుక్రవారం 108 సిబ్బంది పట్టణంలో డిమాండ్లతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు 108 ఉద్యోగులు విధుల్లో పాల్గొంటూనే వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. 25వ తేదీలోగా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించకపోతే విధులు బహిష్కరించి పోరాటం చేస్తామన్నారు. 108 వ్యవస్థను ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలని, జీఓ 49ను అమలు చేయాలని, శ్లాబ్ సిస్టమ్‌ను పునరుద్ధరించాలని, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగాల్లో తమకు వెయిటేజీ కల్పించాలని, ఉద్యోగులు మరణిస్తే రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 108 సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురంలో 28న కోటి దీపోత్సవం


మాట్లాడుతున్న హరిహరావు

మార్కాపురం: కార్తీక మాసం సందర్భంగా మార్కాపురం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 28వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గౌరవాధ్యక్షుడు గోపాలుని హరిహరరావు తెలిపారు. శుక్రవారం రాత్రి నెహ్రూ బజారులోని సాయిబాబా కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటి దీపోత్సవం కార్యక్రమానికి తాళాయిపాలెం పీఠాధిపతులు శివస్వామి, విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ సహ కార్యదర్శి యక్కలి రాఘవులు హాజరవుతారని తెలిపారు. శివ స్వామి ప్రవచనాల అనంతరం శివపార్వతులకు విశిష్ట పూజ, దీపోత్సవం, నక్షత్ర హారతి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు వీరారావు, కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి, కోశాధికారి బి.చంద్రశేఖర్, సభ్యులు ఊటుకూరి రామకృష్ణ, గుంటక వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు


తురిమెళ్లలో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

కంభం: మండలంలోని లింగాపురం గ్రామంలో బెల్టుషాపుపై దాడి చేసి 8 మద్యం సీసాలు సీజ్ చేసినట్లు ఎస్సై బి.నరసింహారావు తెలిపారు. కంభం, తురిమెళ్ల గ్రామాల్లో బెల్టు షాపు నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

అక్రమ మద్యం పట్టివేత



సీజ్ చేసిన మద్యంతో ఎస్సై అంకమ్మరావు

మార్కాపురం రూరల్: మండలంలోని బిరుదుల నరవ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న విప్పర్ల రాజశేఖర్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి, 30 క్వార్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై అంకమ్మరావు తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మానవత కార్యాలయం ఫ్లోర్ నిర్మాణానికి కృషి

- ఏపీఆర్ గ్రూపు సంస్థల అధినేత కృష్ణారెడ్డి


కృష్ణారెడ్డి, సోదరులతో మానవత సంస్థ సభ్యులు

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయ సొంత భవనాన్ని దర్శి రోడ్డులో డిగ్రీ కళాశాల ఎదురుగా నిర్మించేందుకు ప్రతిపాదించారు. ఈ మేరకు సంస్థ సభ్యులు ఏపీఆర్ గ్రూపు సంస్థల అధినేత ఆవుల కృష్ణారెడ్డి, ఆయన సోదరులను హైదరాబాద్‌లో కలిసి కార్యాలయం నిర్మాణంపై చర్చించారు. దీనిపై స్పందించిన కృష్ణారెడ్డి ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణానికి సొంత నిధులు వెచ్చిస్తామని హామీ ఇచ్చినట్లు కల్లం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. దాతలు కృష్ణారెడ్డి, సోదరులు చంద్రశేఖర రెడ్డి, జయరామిరెడ్డి, సంజీవరెడ్డికి సంస్థ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ కన్వీనర్ మువ్వల పార్థసారథి, తాడికొండ వెంకటరావు తదితరులు ఉన్నారు.

రెడ్ల కార్తీక వనభోజనాలు రేపు

బేస్తవారిపేట: స్థానిక పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో రెడ్డి కుటుంబ సభ్యుల ఆత్మీక కలయిక, కార్తీక వనభోజన కార్యక్రమం ఆదివారం ఏర్పాటు చేసినట్లు యోగి వేమన రెడ్డి సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉదయం పోలేరమ్మ ఆలయం, కాశేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, కోలాట భజనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెడ్డి కుటుంబ సభ్యులందరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

దేశ పురోగతిలో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం టౌన్: భారత్ ప్రపంచ దేశాలతో పోటీపడుతూ అభివృద్ధిలో ముందుకెళ్లాలంటే యువత పాత్ర కీలకమని తహసీల్దార్ చిరంజీవి పేర్కొన్నారు. అందుకోసం ఓటుహక్కు వినియోగించుకుని మంచి ప్రభుత్వాలను ఎన్నుకోవాలని సూచించారు. స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నూతన ఓటరు నమోదు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత వ్యక్తిత్వం కలిగిన నాయకులను ఎంపిక చేసుకునేందుకు విద్యావంతులు ఆలోచనా శక్తిని వినియోగించాలని, నైరాశ్య భావాన్ని విడిచి యువకులు ఎన్నికల ప్రక్రియలో తమ బాధ్యత నిర్వహించాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.ప్రభావతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదనశర్మ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ పవన్‌కుమార్, రీసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం శేషకుమార్, కళాశాల అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్, బీసీడీఈ కోఆర్డినేటర్ యువి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ మాట్లాడుతూ టూవీలర్స్ నడపరాదు


మాట్లాడుతున్న గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య

రాచర్ల: ఫోన్ మాట్లాడుతూ టూవీలర్స్ నడపకూడదని గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య పేర్కొన్నారు. శుక్రవారం రాచర్ల ఫారంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే, వాటిని సీజ్ చేయడంతోపాటు తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వెబ్ లింక్‌లు, ఓటీపీ మోసాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై కోటేశ్వరరావు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నలుగురు బెల్ట్ షాపు నిర్వాహకులు బైండోవర్


నిందితులను బైండోవర్ చేస్తున్న తహసీల్దార్

బేస్తవారిపేట: మండలంలో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నలుగురిని బైండోవర్ చేసినట్లు కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ జితేంద్రకుమార్ వద్ద పీవీ పురానికి చెందిన ఇద్దరు, బేస్తవారిపేట, శింగరపల్లెకు చెందిన ఒక్కొక్కరిని బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, నాటుసారా తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బెల్ట్‌షాపులు నిర్వహించేవారి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

పూసల బజారులో పందుల స్వైర విహారం


రోడ్డు పక్కన చిల్లచెట్లలో సంచరిస్తున్న పందులు

కంభం: మండలంలోని కందులాపురం పంచాయతీ పరిధిలోని పూసల బజారులో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో పారిశుధ్యం లోపించి స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. పూసలబజారులో డ్రైనేజీ లేకపోవడంతో మురుగు రోడ్లపైకి చేరుతోంది. నివాసాల మధ్య, రోడ్డు మార్జిన్ల వెంట చిల్లచెట్లు పెరిగిపోవడం, పందులు ఇళ్ల మధ్య తిరుగుతుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం ఏడేళ్ల బాలుడు డెంగీ బారిన పడి మార్కాపురంలో చికిత్స పొందాడు. ఇప్పటికీ కొందరు జ్వరంతో బాధపడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి డ్రెయినేజీ ఏర్పాటు చేయడంతోపాటు పందుల బెడద నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటు హక్కుపై అవగాహన


రాచర్లలో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ శివకోటేశ్వరరావు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలో కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఈవో–1 శివకోటేశ్వరరావు, ఆర్‌ఐ రాఘవ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో–1 శివకోటేశ్వరరావు మాట్లాడుతూ.. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు ప్రాధాన్యత గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ మాలకొండమ్మ, సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మా గోడు వినండి మహాప్రభో..


నీటిలోనే అవస్థలు పడుతూ వెళ్తున్న కాలనీ వాసులు

మార్కాపురం రూరల్: పట్టణంలోని రెండో వార్డు ఏకలవ్య కాలనీలో గత 3 నెలలుగా డీప్‌బోర్ల పైపులు ఊడిపోయి నీరు వృథాగా పోతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. నీరు రోడ్డు మీదకు వస్తుండటంతో నడిచేందుకు కూడా ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా లీకేజీలను అరికట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


ఊడిపోయిన పైపులు

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..



బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో పార్కింగ్ షెడ్ లేకపోవడంతో విద్యార్థినుల సైకిళ్లను ఆరుబయట ఉంచుతున్నారు. సమీప గ్రామాలకు చెందిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థినులు రోజూ సైకిళ్లపైనే వస్తున్నారు. అయితే సైకిళ్లు నిలిపి ఉంచడానికి షెడ్డు కాదు కదా.. కనీసం చెట్లు కూడా లేవు. దీంతో పాఠశాల ప్రహరీకి ఒకవైపున మెయిన్ రోడ్డుపై సైకిళ్లు నిలిపి ఉంచుతున్నారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ సైకిళ్లు పాడవుతున్నాయని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బాలికల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.


పాఠశాల ముందు రోడ్డుపై పెట్టిన సైకిళ్లు